క్లుప్తంగా

విశ్వకర్మకు విశేష పూజలు



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ సభ్యులు

రాజాం: పట్టణంలోని సారిధి రోడ్డులో కంచికామాక్షి ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఏర్పాటుచేసిన విశ్వకర్మ ప్రతిమలకు గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాలవలస పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నాట్యంలో బొబ్బిలి విద్యార్థుల ప్రతిభ



ప్రశంసలు పొందిన పద్మాలయ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు,నిర్వాహకులు

బొబ్బిలి: మహారాష్ట్రలోని షిర్డీ సాయి దేవాలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలో బొబ్బిలి పట్టణానికి చెందిన పద్మాలయ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి, ప్రశంసలు పొందారు. పద్మాలయ అకాడమీ నిర్వాహకులు,నృత్యకారిణి గుండప పద్మజ దర్శకత్వంలో పలు గీతాలకు విద్యార్థులు సుమతేజస్విని,నిహారిక, నాగ లోహిత, హైయతి, పూజిత, అక్షర,యగ్య ప్రియ అబ్బురపరిచేలా నాట్యం చేశారు. డ్యాన్స్ టీచర్ పద్మజతో పాటు వీరందరికీ దేవస్థానం కల్చర ల్ ఆర్గనైజర్ అర్జున్ ఫతాంగరే మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.

ఎస్‌డబ్ల్యూపీసీల పరిశీలన

రాజాం: గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల) నిర్వహణ సక్రమంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు క్లాప్ మిత్రలకు సూచించారు. మండలంలోని కంచరాం, పొగిరి తదితర గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్వహణ తీరును గురువారం ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో తయారు చేసిన సేంద్రియ ఎరువును రైతులకు అందజేశారు. ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఆటో మ్యుటేషన్‌ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర

బొబ్బిలి: ఆటో మ్యుటేషన్ ప్రక్రియను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా రిజిస్ట్రార్ టి. ఉపేంద్రరావు సూచించారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ స్థలాలు, ఇళ్లు కొనుగోలు చేసినప్పుడు ఒకటికి పదిసార్లు పరిశీలన చేసుకోవాలని, నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. ఏమైనా అనుమానాలు ఉంటే స్థానిక రిజిస్ట్రార్ లేదా సిబ్బందిని సంప్రదించి అన్నీ పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ ఏడాది స్టాంప్ డ్యూటీల లక్ష్యం 90 శాతం సాధించామన్నారు. ఆయన వెంట స్థానిక రిజిస్ట్రార్ శ్రీనివాసరావు ఉన్నారు.

లీజుకు ఇస్తామంటే కుదరదు



మాట్లాడుతున్న శంకరరావు, గోపాలం

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐకి చెందిన స్థలాన్ని 50 ఏళ్ల కాల పరిమితికి రిసార్ట్ నిర్వహణ కోసం లీజుకు అప్పగిస్తామంటే అంగీకరించబోమని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొట్నూరు శంకరరావు, మండల కార్యదర్శి ఎస్. గోపాలం అన్నారు. గురువారం సంబంధిత స్థలం వద్ద విలేకరులతో మాట్లాడుతూ హస్తకళల అభివృద్ధి కోసం టూరిజం సంస్థకు 2010లో కేటాయించిన ఈ స్థలాన్ని ఆశాఖ బీజేపీ నాయకుడికి లీజుకు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. లీజు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల పునర్విభజన జరిగి బొబ్బిలి డివిజన్ కేంద్రంగా మారిన నేపథ్యంలో ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాల కొరత ఉందన్నారు. ఆ అవసరాలకు ఈ స్థలం వినియోగించు కోవచ్చన్నారు. అధికారం అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములను ఇలా ఇష్టారీతిగా లీజుకు ఇస్తే ఒప్పుకునేది లేదని మండిపడ్డారు. మొండికేస్తే ఆందోళనలు చేపడతామన్నారు.

అవగాహన

బొబ్బిలిరూరల్: చిన్నారులకు పౌష్టికాహారం అందించడం వల్ల వారు ఆరోగ్యంగా ఉంటారని, పెరుగుదల బాగుంటుందని ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి అన్నారు.పోషణ్ మహాప్రోగ్రామ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పక్కి, పిరిడి,రంగరాయపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు గురువారం అవగాహ కల్పించారు.చిన్నారుల పోషణ, ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. చిన్నారులు ఎత్తు,బరువు కొలిచారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు భేఖాతర్

- రోడ్డుకు ఇరువైపులా నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్, ఆటో స్టాండ్‌లు
- ప్రేక్షక పాత్రలో పోలీసులు



రాజాం పట్టణంలో యూనియన్ బ్యాంకు ఎదుట రోడ్డుపై వాహనాల పార్కింగ్



శ్రీకాకుళం రోడ్డులోని ఎస్‌బీఐ బ్రాంచి ఎదురుగా రోడ్డుపై పార్కింగ్

రాజాం: పట్టణంలో ప్రధాన రహదారికి ఆనుకుని నిర్మాణాలు చేపట్టిన వారు నిబంధనలు పట్టించుకోవడం లేదు. పార్కింగ్ స్థలాన్ని కేటాయించకుండా దుకాణాల నిర్మాణాలు చేపడుతుండడంతో ఆయా దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది.ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. పల్లెల నుంచి జనం రోజూ వివిధ పనుల నిమిత్తం వేలమంది ప్రజలు రాజాం పట్టణం వస్తుంటారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలపై వచ్చే వారు తమ వాహనాలను ఇష్టారీతిగా రోడ్డుపై పార్కింగ్ చేసి తమ పనులు చూసుకుంటున్నారు. పట్టణంలో ప్రధాన రహదారితో పాటు ఇటు శ్రీకాకుళం రోడ్డులో ఎస్‌బీఐ, ఎల్‌ఐసీ కార్యాలయం, గ్రోమోర్ సెంటర్, అటు బొబ్బిలిరోడ్డులో యూనియన్ బ్యాంకు, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బొబ్బిలి జంక్షన్ ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఈ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆనుకుని రోడ్డుమీదకు వ్యాపారాలు వచ్చేశాయి. ఈప్రాంతం ఎదురుగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఉండడంతో ఇక్కడ ఆటోలు కూడా నిలుపుదలచేసి సర్వీసులు చేస్తున్నారు. ఏరియా ఆస్పత్రి, మున్సిపల్‌కార్యాలయం, బొబ్బిలి జంక్షన్, పాలకొండ రోడ్డులో మోర్ వాణిజ్య సముదాయం ప్రాంతాల్లో వాహన పార్కింగ్‌లు, తోపుడు బండ్ల వ్యాపారాలు రోడ్డుమీదే జరుగుతున్నాయి. ఫలితంగా రోడ్డు విస్తీర్ణం తగ్గిపోయి ప్రయాణికులు, బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

సెట్‌బ్యాక్ స్థలం వదలడం లేదు

రోడ్డు పక్కన వాణిజ్య అవసరాలకు భవన నిర్మాణాలు చేసేటప్పుడు భవనం ముందు సెట్‌బ్యాక్ స్థలాన్ని విడిచిపెట్టాలి. కానీ చాలా మంది భవన యజమా నులు ఈ నిబంధన పాటించడం లేదు. నివాసిత అనుమతులు తీసుకుని భవన నిర్మాణాలు చేపట్టి తర్వాత వాణిజ్య అవసరాలకు అనుకూలంగా వాటిని మార్చుతున్నారు. కొందరు రోడ్డుమీద డ్రైనేజీని ఆనుకుని షట్టర్లు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారు.

పట్టించుకోని యంత్రాంగం

నిబంధనలు పాటించకుండా రోడ్డుపై వైట్ మార్క్ దాటి వాహనాలు నిలుపుతున్నా అటు పోలీస్ యంత్రాంగం, ఇటు మున్సిపల్ యంత్రాంగం పెద్దగా పట్టించు కోవడంలేదు. పెద్దపెద్ద షాపులు, భవనాలు కట్టే సమయంలో పార్కింగ్ నిబంధనలు పాటించే విధంగా ప్లాన్ సిద్ధం చేయాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా ఇక్కడ మున్సిపల్ అధికారులు, ఉడా అప్రూవల్ లభిస్తుండడంతో పార్కింగ్, బోర్డింగ్ స్థలాలు లేకుండానే భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. రోడ్లపై పార్కింగ్ చేసే వాహన చోదకులపైన, ఆయా షాపుల యజమానులకు పోలీసులు ఎటువంటి హెచ్చరికలు చేయకుండా ప్రేక్షక పాత్ర వహించడంతో సమస్య తీవ్రతరమవుతోంది.

దృష్టి సారిస్తాం

రాజాం ప్రధాన రహదారిలో వాహన పార్కింగ్‌లపై దృష్టిసారిస్తాం. నిబంధనలు అతిక్రమించి పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వైట్ మార్జిన్ దాటి వాహనాలు నిలుపుదలచేయరాదు. ఇదివరకే రాజాం పట్టణంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలకు సూచనలు చేశాం.

– కె.అశోక్‌కుమార్, రాజాం పట్టణ సీఐ

నేడు 'చలో మెడికల్ కాలేజ్'



బొబ్బిలి: వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు



వంగర: మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

బొబ్బిలి: ఎంతో ఉన్నత ఆశయంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య, ప్రజలకు ఉన్నత వైద్యం అందించ డాన్ని పక్కన పెట్టి వాటిని ప్రైవేటీకరిస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అత్యంత దారుణమని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను పట్ట ణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని కొండకరకాం వద్ద ఉన్న జేఎన్‌టీయూ జంక్షన్‌కు నియోజకవర్గ విద్యార్థులు, యువత, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, ప్రజలు శుక్రవారం ఉదయం పదిగంటలకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి ప్రభుత్వ వైద్య కళాశాలకు ర్యాలీగా వెళ్లి పరిశీలన చేద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన మెడికల్ కాలేజీను టీడీపీ కూటమి నాయకులకు చూపించి ప్రైవేటీకరణను అడ్డుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

యువత, విద్యార్థులు తరలిరండి

వంగర: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరి షత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరులతో మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం 'చలో మెడికల్ కాలేజ్' కార్యక్రమం చేపట్టనున్నామని చెప్పారు. విజయనగరం జిల్లా కేంద్రంలోని గాజులరేగ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వం మెడికల్ కళాశాలకు శుక్రవారం ఉదయం ర్యాలీగా వెళ్లనున్నామని, విద్యార్థులు, యువత, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని పిలుపు నిచ్చారు. సర్పంచ్ పోలిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొక్కేల వెంకటఅప్పలనాయుడు, కాంబోతుల శ్రీనివాసనాయుడు,తదితరులు పాల్గొన్నారు.

ప్రజల తరఫున పోరాడండి



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న రాజేష్

రాజాం: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాజాం నియోజకవర్గంలో సమస్యలు, ప్రజలు, రైతులు, పలువర్గాల ఉద్యోగులు, పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, టీడీపీ కూటమి అఘాయిత్యాలను జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కూటమి అఘాయిత్యాలను ధైర్యంగా ఎదుర్కోవాలని, ప్రజల తరఫున పోరాడాలని తనకు జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు రాజేష్ మీడియాకు తెలిపారు.త్వరలోనే మంచిరోజులు వస్తాయని, పార్టీ కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చారని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస విద్యుత్ ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఈఈ రఘు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ నిర్వహణ, మరమ్మతులు చేపట్టను న్నందున భోజరాజపురం వాటర్ పంపుహౌస్‌తోపాటు మెట్టవలస, గున్నతోటవలస, ఎం.పణుకువలస, పెంట గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపిక



రేగిడి: జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన లక్ష్మీపురం హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయి అండర్ -14 స్కూల్‌గేమ్స్ బాల, బాలికల పోటీల్లో సత్తాచాటారు. ఈనెల 17న ఏ.వి.పురంలో నిర్వహించిన డివిజనల్ స్థాయి పోటీల్లో వివిధ క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు 15 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎం.వి. కామేశ్వరరావు గురువారం తెలిపారు. విద్యార్థులతోపాటు పీడీలు సూరప్పనాయుడు, రోజారాణిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



వంగర: వంగర హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు వంగర విద్యార్థి

వంగర: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ట్రయాథ్లాన్ పోటీలకు అండర్– 14 విభాగంలో వంగర ఉన్నత పాఠశాల విద్యార్థి సీహెచ్.చరణ్‌తేజ ఎంపికయ్యాడు. అలాగే డివిజన్ స్థాయి వాలీబాల్, హైజంప్, ఖోఖో పోటీల్లో అయిదుగురు విద్యార్థులు ప్రతిభకనబరిచారు.ఈ విద్యార్థులను ఎంఈఓ–2 మీసాల కూర్మినాయుడు, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న వసుదైక కుటుంబం ఫౌండేషన్ ప్రతినిధులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని నలుగురు విద్యార్థినులకు బెంగళూరుకు చెందిన 'వసుదైక కుటుంబం' స్వచ్ఛంద సంస్థ సైకిళ్లు సమకూర్చింది. వీటిని ఆసంస్థ ప్రతినిధులు కొల్లి ఈశ్వరరావు, పి.హరిప్రసన్న గురువారం విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనాథ, పేద విద్యార్థుల చదువుల కోసం వసుదైక కుటుంబం ఫౌండేషన్ సహాయం అందిస్తోందని చెప్పారు. ప్రతిభావంతులైన విద్యార్థినులకు కెనరాబ్యాంకు ఆర్థిక సాయంతో ఉపకార వేతనం కూడాఅందిస్తున్నామని తెలిపారు. 'వసుదైక కుటుంబం' సంస్థ ప్రతినిధులకు హెచ్‌ఎం ఎం.వి.కామేశ్వరరావు, సర్పంచ్ కెంబూరు తేజో వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడుఎర్నేన అప్పలనాయుడు, కర్నేన రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష



రామభద్రపురం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, వైద్యాధికారి



రేగిడి: సోమరాజుపేటలో మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి రీణాచౌదరి



వంగర: జె.కె.గుమ్మడలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ సౌమ్య, వైద్యసిబ్బంది

రామభద్రపురం: మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష అని, వారు బాగుంటేనే కుటుంబంతో పాటు సమాజం బాగుంటుందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళలు,బలమైన కుటుంబాల కోసం కేంద్రప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా అంతా కృషి చేయాలని చెప్పారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2వ తేదీ వరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలు, బాలికలకు వైద్య సేవలందిస్తామని చెప్పారు. ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

రేగిడి: ఆరోగ్యమే మహాభాగ్యమని, మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి రీణాచౌదరి సూచించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమరాజుపేటలో మహిళలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉందాం.. కుటుం బాలను ఆనందంగా ఉంచుదామని మహిళలతో మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ సవలాపురపు ముద్దులమ్మ,ఈఓపీఆర్డీ రాధాకృష్ణ,తదితరులు పాల్గొ న్నారు.

మహిళలకు వైద్యపరీక్షలు

వంగర: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జె.కె.గుమ్మడ గ్రామంలో వైద్యాధికారి సౌమ్య ఆధ్వ ర్యంలో గురువారం మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 112 మంది గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, మహిళలకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు మరిచెర్ల గంగారావు, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కిరణ్, సుజాత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి



రేషన్ డీలర్లకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ వరప్రసాద్

బాడంగి: స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ కె.వరప్రసాద్ రేషన్ డీలర్లకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ లబ్ధిదా రులు విధిగా స్మార్ట్‌రేషన్ కార్డులు తీసుకోవాలని చెప్పారు. స్మార్ట్ కార్డులపై క్యూఆర్‌కోడ్ ఉన్నందున రేషన్ సరుకులు విడిపించుకు నేందుకు ఈ కార్డులు అవసరమని అన్నారు. లబ్ధిదారులు ఈ కార్డులు తీసుకోకపోతే రద్దు అవుతాయని హెచ్చరించారు. వలస వెళ్లిపోయిన వారికి చెందిన, వేరే గ్రామాల వారి కార్డులు డీలర్ల వద్ద ఉంటే వాటిని తమ కార్యాలయానికి అప్పగించాలని సూచించారు. సీఎస్‌డీటీ స్వర్ణలత పాల్గొన్నారు.

సమస్యలపై నిద్ర నటన..!

- 'పల్లె నిద్ర' పేరిట ఎంపీ కలిశెట్టి హంగామా
- గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తామంటూ పాతపాటే పాడిన ఎంపీ
- గతంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్న గిరిజనులు



ఎనుబరువులో పర్యటిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



తారు రోడ్డుగా అభివృద్ధి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చిన కొండకెంగువ రోడ్డు

రామభద్రపురం: మండలంలోని రావివలస గిరిజన పంచాయతీ పరిధిలోని ఎనుబరువు గ్రామంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనా యుడు బుధవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. రాత్రి గ్రామసభ ఏర్పాటు చేయడం నుంచి గురువారం ఉదయం పంచాయతీ పరిధి గ్రామాల్లో పర్యటించడం వరకు అంతా హంగామా, ఆర్భాటమే కనిపించింది కానీ సమస్యల పరిష్కారానికి ఎలాంటి భరోసా దక్కలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామసభలో మండల అధికారులతో నివేదికలు చదివించిన తర్వాత సమస్యల పై ప్రజలను ఆరా తీశారు. పంచాయతీకి చెందిన పలువురు మాట్లాడుతూ తమ పిల్లల కు తల్లికి వందనం పథకం వర్తించలేదని, డబ్బులు తమ ఖాతాల్లో జమకాలేదని చెబుతుండగా...ఎంపీ వారిని వారించి ఎవరెవరికి పథకం వర్తించలేదో పేర్లు రాసుకుంటామని చెప్పి, సభ తర్వాత కనీసం పట్టించుకోకుండా వెళ్లిపోయారు. స్థానికంగా ఉన్న విశాఖపట్నం వాస్తవ్యుడి అతిథి గృహంలో రాత్రి బస చేసి గురువారం ఉదయం ఎనుబరువు, ఆర్.చింతలవ లస, కాకులపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు, తదితర సమస్యల పై ఎంపీకి ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. పలువరు పిల్లలను చదివిస్తానని, ఆడపిల్లల వివాహానికి ఆర్థిక సహాయం చేస్తానని, తనకు ఫోన్ చేయాలని నెంబరు ఇచ్చేసి కార్యక్రమం ముగించారు. ఏడాది క్రితం ఇలాగే గిరిజన గ్రామాల్లో ఎంపీ పర్యటించి అనేక హామీలు ఇచ్చారని, నేటికీ వాటిలో ఏ ఒక్కటీ అమలుకాలేదని, ఇది కూడా అలాంటి పర్యటనేనని గిరిజనులు పెదవి విరిచారు.

గత హామీలను గాలికొదిలేసిన ఎంపీ

గతేడాది జూలై 16వ తేదీన కొండకెంగువ పంచాయతీలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సుడిగాలి పర్యటన చేశారు. కొండకెంగువతో పాటు ఆ పంచాయతీ పరిధిలోని జీలికవలస గ్రామ గిరిజనులు,రైతులకు పలు సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కొండకెంగువ నుంచి జీలికవలసకి తారు రోడ్డు, ఏడొంపుల గెడ్డపై బ్రిడ్జి నిర్మాణం, ,శిథిలావస్థకు చేరిన చెక్ డ్యామ్‌కు మరమ్మతులు చేయించడంతో పాటు ఎడమ,కుడి సాగునీటి కాలువల్లో పూడిక తీత,కాలువలకు రాతి కట్టు,జీలికవలసలో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన నిర్మాణం,ఆ గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయడంతో పాటు సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఆయన హామీ ఇచ్చి 14 నెలలు దాటుతున్నా ఇప్పటికీ ఏ ఒక్కటీ అమలు కాలేదు.

పాఠశాలలకు సైన్స్ పరికరాల పంపిణీ



వంగర: ఉపాధ్యాయులకు కిట్లు అందజేస్తున్న ఎంఈఓ కూర్మినాయుడు

రేగిడి/ వంగర: రేగిడి, వంగర మండలాల్లోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు మిడిల్ స్టేజ్, సెకండరీ స్టేజ్ సైన్స్, మ్యాథ్స్ పరికరాల కిట్లను ఆయా మండల కేంద్రాల్లోని ఎమ్మార్సీల్లో ఎంఈఓలు ఉపాధ్యాయులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా బోధించేందుకు ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. రేగిడి ఎంఈఓ–1 ఎం.వి. ప్రసాదరావు ఎంఈఓ–2 బి.ఎరకయ్య, వంగర ఎంఈఓ–2 మీసాల కూర్మినాయుడు, సీఆర్‌ఎంటీసీలు, ఎమ్మార్సీల సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

తెర్లాం: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వాతి, వంశీకృష్ణ అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గ్రామసచివాలయం–2 వద్ద గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. అలాగే ఐసీడీఎస్ సిబ్బంది పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ ప్రదర్శన ఆకట్టుకుంది.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఆనందరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమణ, ఎంఈఓ త్రినాథరావు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్

పోలిపల్లి పైడితల్లి ఆలయ హుండీ లెక్కింపు రేపు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీ కానుకలను ఈ నెల 20వ తేదీన లెక్కించనున్నామని ఈఓ బి.వి.మాధవరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ తనిఖీదారు, ఆలయ ధర్మకర్త, భక్తుల సమక్షంలో హుండీలు తెరవనున్నామని పేర్కొన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.